తలమోదినట్టు దిమ్మెరపోయింది ఆయన మెదడు....ఆ భవంతి నిలువునా ఆయన కళ్ళముందే మీదే కూలిపోయింది....ఆషాక్ తట్టుకోవడం ఆయనవశంలో లేక పోయింది. కలలో మాదిరి తాగిన వాడిలా, బాహ్యస్మృతి కోల్పోయి నిర్జీవంగా, నీరసంగా యింటివైపు నడిచాడు కోటేశ్వరరావు. బిల్ల చెక్క....హూ....బిల్ల చెక్క తన యిల్లు నిలబెట్టింది! అక్కరలేదు....తనకీ బిల్ల చెక్క అవసరంలేదు. ఇల్లూ అవసరంలేదు. పిచ్చివాడిలా గొణిగాడు ఆయన.

* * * *

తెల్లవారేసరికి కోటేశ్వరరావుగారి ఆత్మహత్య వార్త పట్టణమంతా గుప్పుమంది. జీవితం మీద విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్టు ఆయన రాసిన ఉత్తరం చూశాక-లక్షలున్న కోటేశ్వరరావుకి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏం వచ్చిందో, చుక్కలాంటి భార్య, ముత్యంలాంటి కొడుకు వున్న కోటేశ్వరరావుకి జీవితంమీద విరక్తి ఎందుకు పుట్టిందో అర్థంకాక ఊరంతా ఆశ్చర్యపోయింది.

అంతకంటే ఎక్కువగా, ఆయన యావదాస్తి, లక్షలు, ఫ్యాక్టరీలు, షేర్లు, ఇళ్ళు, కార్లు, నగలు, నాణ్యాలు, సమస్త ఆస్తి ఛారిటీ కింద, ఆస్పత్రులకి, స్కూళ్ళకి అనాథాశ్రమాలకి, కుష్ఠురోగుల నిలయానికి, అనాధబిడ్డల చదువులకి, సత్రాలకి-రకరకాలుగా చెందేట్టు విల్లు రాసి, కట్టుకున్న భార్యకి, అపురూపంగా పుట్టిన ఏకైక వంశోద్ధారకునికి దమ్మిడీ మిగల్చలేదని ఆయన రాసిన విల్లు తెలిశాక-ఊరంతా మరోసారి ఆశ్చర్యపోయింది.

★

# హారతి పళ్లెం

రెండు రోజుల ముసురు తరువాత ఊర్లో సూర్యు డుదయించాడు. తెల్లారి సూర్యుడ్ని చూడగానే జనం సంతోషించారు. సంతోషించని దెవరన్నా వుంటే పూజారి మాధవయ్య ఒక్కడే. తెల్లారకుండా వుంటే! సూర్యు డుదయించకుండా వుంటే! ఆ ముసురు ప్రళయంగామారి యీ వూరు వాడ, యీ జగత్తుని ముంచె

త్తే స్తే....ఏ బాధా వుండదు. డబ్బు సంపాదించాలి-దినుసులు కొనాలి - వండాలి, కడుపు నింపుకోవాలి, మానం కప్పుకోవాలి, పెళ్లాడాలి, పిల్లల్ని కనాలి, వాళ్ళకి చదువు సంధ్యలు చెప్పించాలి, పెళ్ళిళ్లు చెయ్యాలి, కట్నాలు పొయ్యాలి, అల్లుళ్ళని గౌరవించాలి, పురుళ్ళు పోయాలి, బారసాలలు చెయ్యాలి, ఏది వదలకుండా సంప్రదాయం ప్రకారం ముద్దుముచ్చట్లు జరిపించాలి-వీటన్నింటికి డబ్బుండాలి ఆ డబ్బు లేకపోతే ఆ పాట్లు-యీ బాధలు ఏవిలేకుండా-తెల్లారకపోతే - యీ ముసురు తగ్గకపోతే - వరదలువచ్చి యీ వూరు వాడ ముంచెత్తితే తనకే సమస్యలు మిగలవు. మంచంమీద ముసుగులోంచి బయటపడకుండా ఆ ముసుగులోనే ఊపిరి ఆగిపోతే ఎంత బాగుండు ననిపించిందాయనకి.

"యీ దిక్కుమాలిన సంసారం చెయ్యడం నావల్ల కాదు మహాప్రభో-పొయ్యిలోకి కర్రలులేవు-పొయ్యిమీదకి గింజలులేవు. కర్రలులేవు, బొగ్గులయి పోయాయని మొన్ననగా చెప్పాను. తెల్లారేసరికి గొంతులో కాఫీలు దిగాలి - పంచదార నిండుకుంది. ఆ పాలదాని ధర్మమా అని మానకుండా ఏ నీళ్ళో ఆ నీళ్ళు పోస్తూంది. యీ పూటకి రెండు చంచాలు కాఫీపొడి పిన్నిగారింటినించి తెచ్చాను. బెల్లంముక్క మరో యింట్లో ముష్టి-దిక్కుమాలిన ముష్టిబతుకు అయిపోయింది. యీ సంసారం ఎప్పటికి తెల్లారుతుందో, దిక్కుమాలిన తడికర్రలు ఊదలేక ప్రాణం కడగడ్తూంది. వాగి వాగి చస్తుంది, అదే పూరుకుంటుంది అని నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటారు అయ్యో—ఇల్లాలే - ఎంతకని కష్టపడ్తుంది. ఎంతకని అప్పులు తెస్తుంది. యీ సంసారం దాని వొక్కరిదేనా అన్న జ్ఞానంవున్న మనిషయితే అలా దిమ్మచెక్కలా కూర్చుంటారా - పెళ్లాం బిడ్డల్ని పోషించలేని వాజమ్మలకి పెళ్ళెందుకు. పిల్లలెందుకు....ఛీ....మనిషి జన్మ ఎత్తినందుకు పౌరుషం వుండాలి...." యింతకీ నా ఖర్మ ఎవరినని ఏం లాభం...." తాయారమ్మ యీ స్తోత్రం మాధవయ్యకి సుప్రభాతంలా రోజూ వినిపించేదే కనక ఆయన చలించలేదు - కాఫీవాసన తగలగానే కుక్కిమంచంలోంచి లేచి చాపలోంచి పండుపుల్ల లాగి నమలడం ఆరంభించాడు-అన్ని మాటలంటున్నా చీమ కుట్టినట్లయినా లేకుండా సావకాశంగా పళ్ల తోముకుంటున్న మొగుడ్ని చూసేసరికి తాయారమ్మకి తిక్క రేగింది.

"తిండికి తిమ్మరాజు - పనికి పోతరాజు - నాలుగు రాళ్ళు సంపాదించడం చాతకాదు కాని వేళవేళలకి కాఫీలకి భోజనాలకి తయారు. పెళ్ళాం అప్పడాలువత్తి, వడియాలు పెట్టి. నీళ్ళబిందెలు మోసి, పిండి విసిరి మేపుతూంటే తినడానికి సిగ్గెలా లేదో,....వరయ్ వాసు వెధవా లేరా. వసే కామాక్షీ లేవవే. బారెడు పొద్దెక్కినా మంచం దిగవు ఆడదానివి కావుటే. నీ బుద్ధి ఇలా తగలడబట్టే ఆ కాపురం అలా

తగలడింది. అయ్యకితగ్గ కూతురివి కన్నకూతురు కాపురం చక్కదిద్దాలన్న యావ తండ్రికిలేదు, అయ్యని నిలబెట్టి ఆ డబ్బు తెప్పించి కాపురంకి పోవాలన్న ఆరాటం కూతురికి లేదు - అంతా ఒక్కలాంటి సంతే - యీ పాడు సంసారం యీదడం నావల్ల కాదింక-నల్గురిలో తలెత్తుకోలేక చచ్చిపోతున్నాను. అమ్మాయెందుకు కాపురానికి వెళ్ళదు అని అందరూ ఆరా తీసేవారే - నా కూతురెందుకు కాపురానికి వెళ్ళలేవో వూర్లోవాళ్ళకే కావాలి. యీ అడిగే వెధవలందరూ తలోవది యిచ్చి సాయం చెయ్యరాదూ - హుం నా నోరు నొప్పిగాని యీ యింట్లో ఎవరికీ చీమకుట్టినట్లుందా- రావే తల్లీ రా - మొహం కడుక్కుని కాఫీ సేవించు. పోయిన మొగుడు పోతే పోయాడన్నట్టు....పీడా వదిలిందని యీవిడగారు ఉద్యోగం వెలగబెడ్తుందిట. కూతురుని కాపురానికి పంపే సత్తాలేని యీ తండ్రిగారి వత్తాసు దానికి. వరేయ్ వాసు గాడిదా లేవరా, దున్నపోతులా పడుకోడం కాదు - రెండురోజులు ముసురు అంటూ స్కూలు ఎగగొట్టావు. పుస్తకాల దుమ్ము దులుపు.... ఆ తండ్రికి తగ్గ తనయుడివి-పొట్టకోసినా అక్షరంముక్క లేదు....అటు వేదంలేదు, యిటు చదువు లేదు. రామరామ ఏనాడు ఏం పాపం చేసుకున్నానో యీ మొగుడు, పిల్లలు, యింకెన్నాళ్ళో యీ పాడుబతుకు-ఆ దేముడు నన్నెందుకు తీసుకుపోడో...."తండ్రి, పిల్లలు ఎవరూ ఆ మాటలు విననట్టే ఎవరి పనులు వాళ్ళు చేసుకున్నారు- మాధవయ్యలో ఏనాడో చీము నెత్తురు హరించిపోయాయి. అన్ని తిట్టినా కోపం రాదాయనకి. పాపం తనని కట్టుకుని ఏం సుఖపడింది నిజానికి! నల్గురు ఆడపిల్లల్ని, యిద్దరు మగపిల్లల్ని ఈ లోకంలోకి తేవడం తప్ప తను ఏం చెయ్యగలిగాడు. ఏం సుఖపెట్టాడు. పేద పురోహితుడింట్లోపుట్టి పేద పూజారిని కట్టుకుని పిల్లలు. రోగాలు. చాకిరి తప్ప ఏం సుఖపడింది- ఏదో జమీందారుగారు బతికున్నన్ని రోజులు తిండికి యిబ్బంది పడకుండా రోజులు గడిచిపోయాయి. ఆయనే వేణుగోపాలస్వామి మందిరం కట్టించి పూజారిని చేసాడు. దివాణంనించి ఏడాది గ్రాసం వచ్చేది. పండుగలు, పబ్బాలకి కొత్త బట్టలు పంపేవారు. పర్వదినాలకు పురాణ శ్రవణం చెప్పించి ఘనంగా సత్కరించేవారు-దేవాలయంలో భక్తుల దక్షిణలుండేవి. రెండుగదుల కొంప కట్టించి రెండెకరాలు పొలం రాసిచ్చి బీదబ్రాహ్మణుడి బాధ్యత తీర్చుకున్నాడు. ఆ మహారాజున్న రోజుల్లో భుక్తికి లోటులేకుండా గడిచిపోయేది. అదిగో ఆయన పోయారు. జమిందారీలు పోయారు-జమీలు మంటగలిశాయి - వాళ్ళకే గతిలేదు. తమని ఆదుకొనేదెవరు? ఆయనుండగా యిద్దరి కూతుర్లకి బాగానే పెళ్ళిచేశాడు-ఆ తర్వాతే కష్టాలు ప్రారంభం—మూడో కూతురికి ఎకరం పొలం అమ్మి చేశాకే దరిద్రం పట్టుకుంది. తిండిగింజలకే కరువొచ్చింది. కొడుకు రెక్కలువచ్చి తన దారి తను వెతుక్కున్నాడు. తను తన సంసారం-వాడి పాట్లు వాడివి—తండ్రి గోల పట్టదు. పట్టించుకునే శక్తిలేదు. నాలుగో కూతురు

ఎదిగి వచ్చింది. ఆదాయం లేదు—అప్పులు ఆరంభం అయ్యాయి. ఆఖరిది అందరి లోకి చురుకైంది—ఆడపిల్లలకి నాలుగక్షరం ముక్కలు రావాలి. అనుకునే రోజులు వచ్చాయి. ఉచిత వేతనం, ఊర్లో స్కూలుంది. కనక మెట్రిక్‌వరకు చదివించాడు. చూపులకి బాగుంటుంది. అంత మాత్రాన మొగుడు దొరుకుతాడా! ఇరవై మూడేళ్ళు దాటిపోతుంటే పెళ్ళాం పోరు భరించలేక ఆ కాసిని తిండిగింజ లొచ్చే ఎకరం అమ్మి ఇంటిమీద తాకట్టు తెచ్చి పెళ్ళిచెయ్యక తప్పలేదు. అప్పటినించే బొత్తిగా తిండికీ మొహం వాచే గతికి దిగజారారు. పోనీ పిల్లయినా సుఖ పడిందా అంటే అదీలేదు ఇస్తానన్న కట్నానికి ఐదొందలు పెళ్ళి వేళకి జతపడక యివ్వలేదని, లాంఛనాలు జరపలేదని, సారె తీసుకురాలేదని-మొగుడో త్రాష్టుడు, అత్త గయ్యాళి, మామ చవట అయి దానికి తిండన్నా పెట్టకుండా రాపాడించారు-డబ్బితే అని వాతలు పెట్టి హింసిస్తే పారిపోయి పుట్టింటికి వచ్చింది కూతురు. వియ్యంకుడి కాళ్ళు పట్టుకున్నాడు, డబ్బు నెమ్మదిగా సర్దుతానన్నాడు. నపేమిరా డబ్బు లేకుండా గుమ్మం తొక్కొద్దని తిట్టిపోశారు. ఆ రోజునించి యీ ఏడాదీ—ఎంత ప్రయత్నించినా పట్టుమని పదిరూపాయలు కూడబెట్టలేకపోయారు. తిండికి గతిలేకపోతే ఐదొందలు కూడబెట్టడం ఎలాగ - ఇల్లు తాకట్టు విడిపించుకోలేదు. మళ్ళీ అప్పు ఇమ్మంటే యిల్లు జప్తు చేసుకు దబ్బిస్తానన్నాడు షావుకారు. తల దాచుకోడానికి ఆ నీడన్నా లేకపోతే తమ గతి ఏమవుతుంది, తను అసమర్థుడు, పెళ్ళాం తిట్టిందంటే తప్పు లేదు. చావలేని వెధవలకు - పెళ్ళాం పిల్లలకి తిండి పెట్టలేని బతుకు- అన్నారంటే అంటారు. యీ దరిద్రంనించి విముక్తి పొందాలంటే మరణంతప్ప అన్యథా శరణం నాస్తి....కాని ...కూతురు కాపురం చక్కపెట్టి — కొడుకు మెట్రిక్ అయ్యాక ఎవడి కాళ్ళో పట్టుకుని వాడికేదో తోవ చూపించాక తను తోవ చూసుకోవాలి. కన్నందుకు తన కనీస కర్తవ్యం అది - కూతురు కాపురం చక్కపడాలంటే డబ్బు కావాలి. ఐదొందలు కావాలి - ఎక్కడనించి తేవాలి - ఎవరిస్తారు? ఆయన ప్రశ్న అది. ఆయన ఆరాటం అది. గత కొద్ది రోజులుగా ఆయన తీవ్రంగా ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు — అందుకే యీ రోజు భార్య తిట్లు అంత బాధించలేదు.

* * *

వేణుగోపాలస్వామి గుడిలో గంటలు మోగాయి. భక్తులు కొందరు హారతి కోసం నిల్చున్నారు.

జమీందారు కాలంలో వేణుగోపాలస్వామి ఆలయం కళకళ్లాడేది - చీని చీనాంబరాలతో. నిలువెత్తు మాలలతో. ధూపదీపాలతో రోజూ అర్చన జరిగేది.

దద్దోజనం, చక్రపొంగలి, పులిహోర, రోజుకొకటి చొప్పున భోగం జరిగేది-పర్వదినాలలో ప్రత్యేక అలంకారాలు పురాణ పఠనం జరిగేది.

జమీందారుగారితోపాటు వేణుగోపాలస్వామి వైభవం అంతరించింది. ఆలయం గోడలు బీటలు వేశాయి. బీటలలో పిచ్చి మొక్కలు మొలిచాయి. సున్నానికి నోచుకోక గోడలు నాచుపట్టాయి-నేల పెచ్చులు పూడింది. వేణుగోపాలస్వామి విగ్రహం వన్నె తగ్గింది. ఏనాటి చీని చీనాంబరాలో వెలిసి వాలికలు పీలికలు అయ్యాయి. దీపస్తంభాలలో నూనెకూడా కరవయి ఒకే ఒక వత్తివేసి దీపం వెలిగిస్తాడు మాధవయ్య—ఆ నాటి ఆ భాగ్యం. భోగం అంతరించి బీదవాడిలా నిలిచాడు వేణుగోపాలస్వామి. ఆనాటి వైభవానికి గుర్తుగా ఆలయంలో వెండి హారతిపళ్ళెం, వెండి శఠగోపం మాత్రం నిలిచాయి. చుట్టూ నగిషీలు చెక్కిన రెండొందల తులాల హారతిపళ్ళెం .... ఆ హారతి పళ్ళెం .... ఆ హారతిపళ్ళెం పట్టుకున్న మాధవయ్య చెయ్యి వణుకుతూంది. ఈ రోజు అసలు గుడి తలుపులు తెరిచి లోపలికి అడుగు పెట్టిం దగ్గరనించి మాధవయ్య కాళ్ళల్లో వణుకు పుట్టింది. పూజ చేస్తూ మంత్రాలు చదువుతూ ఎన్నడూలేంది తడబడి తప్పులు చదివాడు. చేతుల్లో బలం హరించిపోయినట్టు హారతి యిస్తూ గంట కొడుతూంటే చెయ్యి వణికింది. ప్రతి పనిలో ఆలశ్యం, హారతి కోసం బయట నిల్చున్న జనాన్ని చూసి ఆయన కంగారు మరింత ఎక్కువయి వంటినిండా చెమటలు పట్టాయి - గుండె దడ దడలాడింది. "పంతులుగారూ, ఏమిటింత ఆలశ్యం...." ఎవరో కేకపెట్టారు. 'వస్తున్నా' అంటూ వణుకుతున్న చేతుల్తో హారతిపళ్ళెం, శఠగోపం, తీర్థం తెచ్చి అందరికి హారతియిచ్చి శఠగోపంపెట్టి తీర్థం యిచ్చాడు మాధవయ్య — కళ తప్పిన ఆయన మొహం చూసి "ఏం బాబూ, ఆరోగ్యం సరిలేదా? ఎవరో కుశల ప్రశ్న వేశారు. మాధవయ్య తడబడ్డాడు. "తమకు తెలియందేంవుంది బాబూ, సంసార బాధలు-" పేలవంగా నవ్వాడు ఆయన. అందరూ వెళ్ళాక హారతి పళ్లెంలో పోగయిన అరవయిపైసలు రొంటిని దోపుకున్నాడు. గుడి తలుపులు మూయబోయేముందు చటుక్కున పైమీద గావంచా తీసి హారతిపళ్లెం అందులో చుట్టబెట్టాడు. వేణుగోపాలస్వామివైపు తిరిగి లెంపలు వేసుకుని "నా కింతకంటె దారి ఏదీ లేదన్నది నీకు తెలియనిది కాదు వేణుగోపాలా మన్నించు తండ్రీ" అంటూ గద్గద స్వరంతో ప్రణమిల్లి, చకచక తలుపు తాళంపెట్టి యింటివైపు వెళ్ళాడు.

పెళ్ళాం, కూతురు చూడకుండా అలమరులో పాత పంచాంగాలకింద హారతి పళ్ళెం దాచాడు. ఉన్న ఊర్లో అమ్మితే గుళ్ళో హారతిపళ్ళెం అందరికీ గుర్తే. సాయంత్రం పక్కవూరికి తీసికెళ్ళి అమ్మాలి. తెల్లారిచీకట్నే గుడితలుపులు తీసివుంచి ఏ దొంగో జొరపడి హారతి పళ్ళెం దొంగిలించాడని గొడవచెయ్యాలి.

ఆయన కంతకంటె గత్యంతరం లేదు. దేముడ్ని క్షమించమంటూ మనసులో లెంపలువేసుకుని వెయ్యిదండాలు పెట్టుకున్నాడు. అయినా మనసులో పాప భీతి తగ్గ లేదు. తిండి సయించ లేదు. "ఏం నాన్నా అలావున్నారు వంట్లో బాగులేదా?" కూతురి సానుభూతిగా చూస్తూ అడిగింది. "ఏం లేదమ్మా తడబడ్డాడు మాధవయ్య.

"అందరికీ రోగమే అడ్డెడు గిన్నెకేం రోగంలేదు" యీసడించింది తాయారమ్మ.

"అమ్మా ఆ తినే రెండుముద్దలన్నాతిననియ్యి ఆయన్ని కాస్తప్రశాంతంగా." కూతురు తిరస్కారంగా తల్లిని చూస్తూ అంది.

"అవునే తల్లీ నేనే గయ్యాళిని, రాక్షసిని, నానోరే కనిపిస్తుంది. తండ్రి కూతుళ్ళొక్కటే-నేనో పైదాన్ని-అమ్మశక్తిని"

"అనవే అను-అను, నీ నోటికి అడ్డు అయిపువుందా —నీ నోటికి తాళ లేకా.... యీనాడు—యీ పనికి తలపడ్డా...." ఆయనేం మాట్లాడుతున్నదీ అర్థం కాగానే ఆవేశం చప్పున చల్లార్చుకుని చటుక్కున నోరు మూసుకుని అన్నం తిన సాగాడు.

* * *

చిన్న కునుకుతీసి, లేచి కాస్త పొద్దు వాలాక, వున్న ఒక చిరుగుల లాల్చీ తొడుక్కుని చేతిసంచిలో హారతి పళ్ళెం పెట్టడానికి అలమరు తీసి పాత పంచాం గాల కింద చెయ్యి పెట్టాడు మాధవయ్య అంతే— గుండె గుభీల్మందీ—పళ్ళెంలేదు. ఆరాటంగా చకచక పుస్తకాలన్నీ వెతికి చూశాడు-లేదు. పెట్టిన పళ్ళెం, యింతకీ ఎలా మాయమయింది? ఈలోగా ఏ దొంగ వచ్చాడు- ఎవర్ని అడగడం-చేసిన దొంగ తనం బయటపడదూ? అడగకుండా ఎలా వూరుకోటం? ఆయన గుండెల్లోదడ బయలుదేరింది. 'కామాక్షీ' ఆయనకి తెలియకుండానే అరిచాడు- కామాక్షి రాలేదు- కాని తాయారమ్మ కంయ్‌మంది. "పాడుకొంప కాసేపు నడుం వాలుద్దామన్నాలేదు- ఎందుకలా రంకెలు పెడతారు, ఏం కావాలి?" నిద్ర మధ్యలో విసుక్కుంది. "కామాక్షేది?" నెమ్మదిగా అడిగాడు. "ఏదో పత్రికలు తెచ్చుకొస్తానని జానకి దగ్గిరకెళ్ళింది." మాధవయ్య నీరుగారిపోయాడు—కామాక్షి తీయలేదు — వాసు స్కూలుకి వెళ్ళాడు-పళ్ళెం ఎలా మాయమయింది. ఆ భగవంతుడు తనమీద ఆగ్ర హించి తను చేసిన వెధవపనికి బుద్ధి చెప్పడానికి మాయంచేశాడా? అనుమానంతోచి గబ గబ దేవాలయంవైపు వెళ్ళాడు-గర్భగుడి తలుపు తీసివుంది. ఆయన గుండె గుభేల్మంది. ఎదురుగానేవుంది హారతి పళ్లెం-తనుపడ్డ కష్టం అంతా ఆ విధంగా వృథా అయిపోగానే ఏదో ఆవేశం, నిస్సహాయత, కసి, దుఃఖం, అవమానం

ఆయన్ని ఊపేసింది. వ్రతంచెడ్డా ఫలం దక్కనందుకు ప్రాణం ఉసూరు మనిపించింది. మాయదారి దేముడు? ఎంతపనిచేశాడు? దేముడు లేడని ఎవరన్నారు?- ఉన్నాడు. ఎంచక్కా తన పళ్ళెం తను వెనక్కి తెచ్చుకున్నాడు-ఉక్రోషం వచ్చింది మాధవయ్యకి-కసిగా దేముడ్ని చూశాడు. ఏ మయ్యా-వేణుగోపాలా- నలభై ఏళ్ళుగా నీ సేవచేసుకుంటు నిన్నే నమ్ముకుని బతుకున్నానే - ఒక్కనాడన్నా నా కష్టాలకి జాలిపడి నన్నాదుకున్నావా- ఒక్కరోజు నేనున్నానని ముందుకువచ్చి సహాయ పడ్డావా....యీనాడు కష్టాలలో ఉండి, తిండికి గతిలేక, కట్టుకున్న పెళ్ళాం గడ్డిపోచలా తీసిపారేస్తూంటే. కన్నకూతురు కాపురం నిలబెట్టడానికి గత్యంతరంలేక నీ హారతిపళ్లెం అమ్ముకుందామనుకున్నాను. హా....భగవంతుడివిగాబోలు, భక్తులకష్టాలలో ఆదుకోవాల్సినవాడివి, ఆదుకోకపోగా....నీ యింతోటి హారతిపళ్ళెంకోసం కక్కుర్తిపడి లాక్కుపోయావా, వెండి హారతిపళ్లెం గాని తమ హారతికి పనికిరాదా? నా కడగండ్ల కంటె నీ హారతిపళ్లెం నీకెక్కువయిందా? ఎంత నిర్దయుడివయ్యా దేముడూ-నా కన్నకూతురు కాపురం కంటె నీ వెండిపళ్ళెం నీకెక్కువా-హా....నీ కూతురుగాదుగా, నీకెందుకు బాధ? నీవసలుంటే....నీకు ఓ హృదయం వుంటే-యిలా చేస్తావా, నీవు నల్లరాయివయ్యా....అంతే ఉత్త రాతిబొమ్మవి-నిన్ను నమ్మి పూజించే వెర్రివెధవలం మేము-నీవు పాషాణానివి—నీవే వుంటే రా- లేచివచ్చి ఆ పళ్లెం యియ్యి- ఇన్నేళ్ళుగా కొల్చినందుకు నీ మహిమచూపు లేదంటే....చూడు.... ఏం చేస్తానో....'పిచ్చివాడిలా ఆవేశంగా అరిచాడు. ఆయన వళ్ళంతా చెమటలు పట్టాయి- మనిషి పూనకం వచ్చిన వాడిలాగ ఊగిపోయాడు. నీకోపానికి బెదరనులే....పో....పో పిచ్చివాడా అన్నట్టు వేణుగోపాలస్వామి కదలక మెదలక అలాగే చిరునవ్వులు చిందిస్తూ నిల్చున్నాడు. అది చూసేసరికి మాధవయ్య ఆగ్రహం అవధులు దాటింది. "హ....నవ్వుతున్నావుగాదూ....నా బీదరికం, నా అగచాట్లు, నా నిస్సహాయత చూచి నవ్వుతున్నావుగదూ. హ....నవ్వు .. అంత కంటే నీకేం చాతనవును. ఇదిగో....నీ హారతిపళ్లెం తీసికెడుతున్నాను-నీ దిక్కున్నచోట చెప్పుకో.... రా....ఏం చేస్తావో చెయ్యి...." ఆవేశంగా హారతి పళ్లెం తీయబోయాడు మాధవయ్య.

"నాన్నా...." చటుక్కున తలుపుచాటునించి కామాక్షి వచ్చింది. మాధవయ్య ఉలిక్కిపడ్డాడు. కూతురినిచూసి. "నాన్నా దేముడు హారతిపళ్లెం దేముడికే వుండనీ నాన్న....మనకింత అవసరం లేదు....నాన్న. నాకీవూర్లో స్కూల్లో ఉద్యోగం యిచ్చారు. రెండొందలు జీతం నాన్నా! చూశావా నాన్నా దేముడు మనకి అపకారం చెయ్యలేదు. దేముడు మంచివాడు గనకే ఆ పళ్లెం అమ్మి డబ్బిచ్చి నన్ను అత్తవారింటికి పెళ్ళి ఆ బాధలు పడకుండా చేశాడు. అంతా మనమంచికే చేస్తాడు చూశావా- నాన్నా నన్నింక ఆ నరకానికి పెళ్ళమనకు. నా కాళ్ళమీద నేను నిలబడ్డాను. నన్ను

నేను కడతేర్చుకోడమే గాదు మిమ్మల్ని కడతేర్చగలను- నన్నింక కొడుకనుకో- కామాక్షి గబగబ అంది. కూతురి మాటలు విస్తుపోతూ విన్నాడు మాధవయ్య.

"అయితే హారతిపళ్లెం తెచ్చి నీవా పెట్టేశావు యిక్కడ?" అయోమయంగా అడిగాడు.

"అవును నాన్న- నీ వరస యివాళ నాకెందుకో అనుమానం అన్పించింది- ఇందాక అమ్మదగ్గర అలా అన్నావు- వస్తున్నప్పుడు నంచిలో ఏదో తెచ్చి అలమరలో పెట్టావు. నా కనుమానం వచ్చి చూశాను-సరిగా అప్పుడే పోస్టులో నా ఉద్యోగం ఆర్డరు వచ్చింది. 'హారతి పళ్లెం పవిత్రకార్యానికి పనికొచ్చేది నాన్న- దానితో నన్ను ఆ నీచుడింటికి కాపురానికి పంపడం ఆ దేవుడికి ఇష్టం లేదు నాన్న" కామాక్షి శాంతంగా అంది, మాధవయ్య ఇంకా అయోమయంగానే వేణుగోపాల స్వామి వంక చూశాడు. ఎప్పటిలాగే చిరునవ్వులు చిందించాడు వేణుగోపాలస్వామి.

"నన్ను తిట్టావు చూశావా అనవసరంగా" అన్నట్టనిపించింది. ఆయనకి.

"నీ లీలలు చిత్రమైనవి తండ్రీ....నన్ను క్షమించు వేణుగోపాలా.... నీ ముందు మే మెంతవారం, నా అజ్ఞానాన్ని మన్నించు" చేతులెత్తి నమస్కారం చేసాడు మాధవయ్య. ఆయన కన్నీటిపొరలమధ్య మసక మసకగా కన్పించాడు వేణుగోపాలస్వామి నవ్వుతూ.

★

(స్వాతి సౌజన్యంతో)

# తలుపు గొళ్ళెం

ఆరోజు శోభ శోభనం! రాత్రి పదిగంట లయింది- అమ్మలక్క లందరూ హాస్యాలాడుతూ శోభని గదిలోవదిలి పైన తలుపు గొళ్ళెం పెట్టేశారు.

తలుపు గొళ్ళెం పెట్టగానే-సావిట్లో మంచమ్మీద పడుకున్న శావమ్మగారి గుండెల్లో రాయిపడ్డట్టయింది. బితుకు బితుకుమంటూ తలుపు గొళ్ళెంవంక చూసింది. "అమ్మా శోభా-నాతల్లీ! నే నేంచేతునే తల్లీ"-అనుకుంది బాధగా. రాత్రి శోభ తెల్ల